క్లుప్తంగా

టైల్స్ దుకాణంలో చోరీ



దుకాణంలోకి చొరబడినట్లు సీసీ కెమెరా ఫుటేజీలో కన్పిస్తున్న ఆగంతకుడు

భైంసాటౌన్: పట్టణంలోని భైంసా–బాసర మార్గంలో మక్రానా టైల్స్ దుకాణంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. దుకాణ యజమాని షేక్ వహీద్ కథనం ప్రకారం.. శుక్రవారం సాయంత్రం దుకాణం మూసి ఇంటికి వెళ్లగా అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి దుకాణం వెనుక రేకును కట్ చేసి లోనికి చొరబడ్డాడు. కౌంటర్‌లో రూ.2.40లక్షలు అపహరించుకుపోయినట్లు బాధితుడు తెలిపాడు. ఈ మేరకు చోరీ దృశ్యాలు సీసీ కెమెరాలో నమోదయ్యాయి.

నేడు విద్యుత్ సరఫరా బంద్

సోన్: మరమ్మతుల నేపథ్యంలో మండలకేంద్రంలోని 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని సోన్, మాదాపూర్, గంజాల్ గ్రామాల్లో ఆదివారం ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ అనిల్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. త్రీ ఫేజ్ కరెంట్ అంతరాయం రాత్రి ఇస్తామని.. వినియోగదారులు గుర్తించి సహకరించాలని కోరారు.

వన్యప్రాణుల వారోత్సవాలు



చెరువు వద్ద సిబ్బంది, గ్రామస్తులు

మామడ: వన్యప్రాణులు, జంతు, వృక్షజాలంను సంరక్షించడంతోనే పర్యావరణం సమతుల్యత ఉంటుందని దిమ్మదుర్తి అటవీక్షేత్ర అధికారి శ్రీనివాస్‌రావు అన్నారు. జాతీయ వన్యప్రాణుల వారోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని పొన్కల్ వెంగన్న చెరువు వద్ద బర్డ్ వాచింగ్, సఫారీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పలు విషయాలు వివరించారు. కార్యక్రమంలో ఎఫ్‌బిఓ శ్రీనివాస్, ఎఫ్ఎస్‌ఓ అన్నపూర్ణ, ప్రభాకర్, జాఫర్, ఎఫ్‌బీఓలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

ముధోల్: మండలకేంద్రానికి చెందిన పాత్రికేయుడు రాహుల్ తండ్రి రాంజీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని శనివారం ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ పరామర్శించారు. మృతికి కారణాలను తెలుసుకొని సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ లక్ష్మీ నర్సాగౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ ధర్మపురి సుదర్శన్, బీజేపీ మండలాధ్యక్షుడు కోరి పోతన్న, మాజీ ఎంపీటీసీ దేవోజీ భూమేశ్, నాయకులు తాటివార్ రమేశ్, జీవన్, శ్రీనివాస్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

30న షిర్డీకి పాదయాత్ర

నిర్మల్‌టౌన్: సాయిదీక్ష సేవా సమితి ఆధ్వర్యంలో 11వ సారి షిర్డీకి పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు సమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్‌రెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30న జిల్లాకేంద్రంలోని గండి రామన్న దత్తసాయి ఆలయం నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. పాదయాత్రకు వచ్చే భక్తులు ఉప్పుల నందు 80081 99293, కొక్కుల లక్ష్మణ్ 94413 72517 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అన్నపూర్ణ గురు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న మూర్తి

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని హరిహర క్షేత్రం ఆలయ గురుస్వామి పీఎన్ మూర్తిని అన్నపూర్ణ గురు పురస్కారం వరించింది. ఈ అవార్డును మహా శాస్త్ర సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని త్యాగరాజ గాన సభలో మూర్తికి అందజేశారు.

పారిశుద్ధ్యంపై పట్టింపేది



దిలావర్‌పూర్: మండలకేంద్రంలోని కేజీబీవీ, ఉర్దూ మీడియం పాఠశాల పరిసరాలు చెత్తాచెదారంతో నిండి దుర్గంధం వెదజల్లుతున్నాయి. పాఠశాలకు వెళ్లే రోడ్డు మార్గంలో మురుగు నీటి ప్రవాహంలో చెత్తవ్యర్థాలు పడేస్తున్నారు. దీంతో ఈ దారిలో పోచమ్మ ఆలయానికి వెళ్లే భక్తులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని విద్యార్థులు, స్థానికులు కోరుతున్నారు.

పాత బావి పూడ్చరూ..

లోకేశ్వరం: మండలంలోని ధర్మోరలో ఊరు మధ్యలో ఉన్న పాతబావి ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు బావి వర్షపునీరు, పిచ్చిమొక్కలు, వ్యర్థాలతో నిండిపోయింది. బావి చుట్టూ ఇళ్లల్లో చిన్నారులు ఉన్నారు. ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు పాతబావిని పూడ్చివేయాలని కాలనీవాసులు వేడుకుంటున్నారు.



దుర్గామాత శోభాయాత్ర



నర్సాపూర్(జి): మండలకేంద్రంలోని కుర్మేవాడలో శనివారం దుర్గామాత శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. మహిళలు, యువతులు, చిన్నారులు నృత్యాలు చేస్తూ సందడిగా గడిపారు. అనంతరం ఎస్సారెస్పీ పరీవాహక ప్రాంతంలో ప్రతిమలను నిమజ్జనం చేశారు.

బండ్లబాట.. అధ్వానం



ఉమ్రి(కే) గ్రామ శివారులో బురదమయంగా బండ్లబాట



ఉమ్రి(కే) శివారులో చేనులో సోయా పంటను నిల్వ చేసిన రైతు

- రాకపోకలకు రైతులకు ఇక్కట్లు
- చేన్లలోనే పంట కుప్పలు
- అమ్ముకునేందుకు అవస్థలు

తానూరు: మండలంలోని పలు గ్రామాల్లో బండ్లబాటలు(మట్టి రోడ్లు) అధ్వానంగా మారాయి. దీంతో పంట చేన్ల వద్దకు ఎరువులు తీసుకెళ్లేందుకు, పంటను ఇంటికి తెచ్చుకునేందుకు రైతులు ఇబ్బంది పడుతున్నారు. తానూరు మండలంలో 31 పంచాయతీల పరిధిలో 36 గ్రామాలున్నాయి. మహలింగి, వడ్‌ఝరి, ఝరి(బి), ఉమ్రి(కె), ఎల్వి, హిప్నెల్లి, మొగిలి, మసల్గా, బామ్ని తదితర గ్రామాల్లోని పంట చేన్ల వద్దకు ఎడ్లబండ్లు, ట్రాక్టర్లపై వెళ్లేందుకు సరైన రోడ్లు లేవు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మట్టి రోడ్లు బురదగా మారి.. మోకాళ్లలోతు వరకు దిగబడుతున్నాయని రైతులు వాపోతున్నారు. దీంతో పంటను చేన్ల నుంచి ఇళ్లకు తీసుకురాలేని పరిస్థితి నెలకొంది.

పంట కోతలు ప్రారంభం..

వారం రోజులుగా సోయా పంట కోతలు ప్రారంభమయ్యాయి. చేన్ల వద్దకు వెళ్లే రోడ్లు బురదమయంగా మారడంతో రైతులు తమ పంట కుప్పలను చేన్ల వద్దే నిల్వ చేసుకుంటున్నారు.

మరమ్మతులు చేపట్టాలంటున్న రైతులు..

గతంలో ఉన్న రోడ్లపై మొరం వేసి మరమ్మతు చేపట్టాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు సరిగా లేక ఎడ్లబండి సైతం వెళ్లడం లేదని.. ఎరువుల బస్తాలు మోసుకెళ్లాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి పంట చేన్ల వద్దకు వెళ్లే రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని రైతులు వేడుకుంటున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



ఏటా వర్షాకాలంలో చేన్ల వద్దకు వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నాం. ఇటీవల వర్షాలకు రోడ్లు మరింత బురదమయంగా మారాయి. అడుగు తీసి వేయలేని పరిస్థితి ఉంది. ప్రస్తుతం సోయా పంట కోతలు ప్రారంభం కాగా.. చేన్లలోనే కుప్పలు పోసి కాపలా వెళ్తున్నాం. అధికారులు బండ్లబాటకు మొరం వేసి సమస్య పరిష్కరించాలి.

– రాంపటేల్, హిప్నెల్లి

ముగిసిన పూలపండుగ



ఖానాపూర్: మస్కాపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



పార్‌పెల్లిలో బతుకమ్మలతో చిన్నారులు

ఖానాపూర్/కడెం/లక్ష్మణచాంద/దస్తురాబాద్: జిల్లాలోని పలుచోట్ల శనివారం సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి గౌరమ్మకు పూజలు చేశారు. ప్రధాన కూడళ్ల వద్ద బతుకమ్మలను ఉంచి ఆడిపాడారు. సంప్రదాయ పాటలతోపాటు డీజే చప్పుళ్ల నడుమ కోలాటం వేస్తూ సందడిగా గడిపారు. అనంతరం సమీపంలోని గోదావరితీరంతోపాటు వాగులు, కాలువల వద్దకు బతుకమ్మలను తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. కడెం మండలంలోని లక్ష్మీసాగర్, చిన్నబెల్లాల్, పెద్ద బెల్లాల్, మద్దిపడగ, లింగాపూర్, ఎలగడప, మాసాయిపేట్, పాండ్వపూర్,అంబారిపేట్, చిట్యాల్, తదితర గ్రామాల్లో, దస్తురాబాద్ మండలంలోని భూత్కూర్, దేవునిగూడెం, ఆకొండపేట, దస్తురాబాద్, పేర్కపల్లె, మున్యాల గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఖానాపూర్ పట్టణంతోపాటు మస్కాపూర్, తర్లపాడ్, గోసంపల్లి, లక్ష్మణచాంద మండలంలోని పార్‌పెల్లి, రాచాపూర్, లక్ష్మణచాంద తదితర గ్రామాలలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు.



ఖానాపూర్: తర్లపాడ్‌లో..



దస్తురాబాద్‌లో..



ఖానాపూర్: గోసంపల్లిలో..

శిథిల వంతెనతో ముప్పు



దిలావర్‌పూర్: మండలకేంద్రం నుంచి దిలావర్‌పూర్‌తండా వెళ్లే మార్గంలో వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. వంతెనపై ఏర్పడిన గుంతల్లో నీరు నిలుస్తుండటంతో వాహనదారులు అదుపుతప్పి కింద పడుతున్నారు. మండలంలోని సాంగ్వి, కంజర్, మల్లాపూర్, బన్సపల్లి, దిలావర్‌పూర్ తండావాసులు ఈ మార్గంలోనే మండలకేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు స్పందించి వంతెనకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

ముధోల్: మండలంలోని ఆష్ట గ్రామంలో పలువురు బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణ్‌రావు పటేల్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

సన్మానం

నర్సాపూర్(జి): మండలకేంద్రానికి చెందిన మాలెపు విజయ గిరిజన సంక్షేమశాఖలో కామాటీగా 30 ఏళ్లు పనిచేసి ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. శనివారం సమత ఫౌండేషన్ చైర్మన్ సమత సుదర్శన్ ఆమెను నర్సాపూర్(జి)లో శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సీఈవో అనిల్ కుమార్, సభ్యులు సాయికృష్ణ, బర్కుంట ముత్యం, షేక్ సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడికి చేయూత



ప్రింటర్ అందిస్తున్న శ్రావణ్‌రెడ్డి

ముధోల్: మండలంలోని ఆష్ట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు శనివారం గ్రామానికే చెందిన నిగ్వా శ్రావణ్‌రెడ్డి రూ.20వేల విలువైన ఆల్‌ఇన్ వన్ ప్రింటర్‌ను అందజేశారు. ఈసందర్భంగా ఆయనను ఎంఈవో గోపిడి గంగారెడ్డి శాలువాతో సన్మానించి అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు సాయం అందించాలని ఎంఈవో కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సునంద, సాయిరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా ‘సోయా’ నూర్పిడి



సోయా నూర్పిడి చేస్తున్న యంత్రం

ముధోల్: వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ముధోల్ మండలంలో సోయా నూర్పిడి పనులు ఊపందుకున్నాయి. పంట కోసేందుకు యంత్రం చేనులోకి వెళ్లకపోవడంతో కూలీలతో కోత పనులు చేయిస్తూ ఒడ్డుకు తీసుకొస్తూ యంత్రం ద్వారా నూర్పిడి చేస్తున్నారు. చేన్లలో తడి ఆరకపోవడంతో యంత్రాలపైనే ఆధారపడ్డారు. ఈ అవకాశాన్ని ఆసరాగా చేసుకుంటున్న యంత్రాల యజమానులు.. అధిక చార్జీలు వసూలు చేస్తూ రైతులను ఇబ్బంది పెడుతున్నారు. రైతులు పంటను నూర్పిడి చేసి ఇంటికి తీసుకొచ్చేందుకు అవస్థలు పడుతున్నారు. గతంలో ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి రాగా.. ప్రస్తుతం 3 నుంచి 4 క్వింటాళ్లకు పడిపోయిందని రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం సోయా పంటకు మద్దతు ధర పెంచి మమ్మల్ని ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

‘బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలి’



మాట్లాడుతున్న శ్యాంసుందర్

కుంటాల: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని జెడ్పీ మాజీ చైర్మన్, నియోజకవర్గ సమన్వయకర్త లోలం శ్యాంసుందర్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని శ్రీనివాస కన్వెన్షన్ హాలులో స్థానిక సంస్థల ఎన్నికలపై కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికల వేళ ఇచ్చిన హామీలు అమలు చేయకుండా దాటవేస్తున్నారని పేర్కొన్నారు. సకాలంలో యూరియా అందించకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆరోపించారు. ఐక్యంగా ఉండి ఎన్నికల్లో పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ పడకంటి దత్తాద్రి, నియోజకవర్గ సమన్వయకర్తలు విలాస్ గాదేవార్, కిరణ్ కొమ్రేవార్, జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జి పెంటవార్ దశరథ్, నాయకులు దాసరి కిషన్, బొంతల పోశెట్టి తదితరులు ఉన్నారు.

మున్నూరుకాపులు ఐక్యంగా ఉండాలి



హాజరైన సంఘం సభ్యులు

బాసర: మున్నూరుకాపులు ఐక్యంగా ఉంటూ పార్టీలకు అతీతంగా ముందుకు సాగాలని ఆసంఘం తాలుకా అధ్యక్షుడు రోళ్ల రమేశ్ పేర్కొన్నారు. శనివారం బాసరలోని ఆర్యవైశ్య సత్రంలో ముధోల్ నియోజకవర్గస్థాయి మున్నూరు కాపు సంఘం సభ్యుల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా బాసరలో నిర్మించే మున్నూరుకాపు సంఘ భవనం కోసం స్థలం పరిశీలించారు. కార్యక్రమంలో ఆ సంఘం తాలూకా కార్యదర్శి గాలి రవి, క్యాషియర్ వివేక్, ఉపాధ్యక్షుడు చిమ్మ పోశెట్టి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



ధర్మాజీపేట్‌లో పరామర్శిస్తున్న జాన్సన్‌నాయక్

కడెం: మండలంలోని ధర్మాజీపేట్ గ్రామానికి చెందిన రొడ్డ చందు రోడ్డు ప్రమాదంలో, లింగాపూర్‌లో నీరటి శ్రీనివాస్ అనారోగ్యంతో మరణించారు. శనివారం బాధిత కుటుంబాలను బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్యా జాన్సన్‌నాయక్ పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు తదితరులున్నారు.

ఖానాపూర్: మండలంలోని పాతఎల్లాపూర్ గ్రామానికి చెందిన పల్లపు పెద్దులు అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని శనివారం బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్యా జాన్సన్‌నాయక్ పరామర్శించారు. ఈసందర్భంగా మృతికి కారణాలు తెలుసుకొని ఓదార్చారు. కార్యక్రమంలో నాయకులు దండుగుల ధరంపురి, ప్రశాంత్‌రెడ్డి, వాల్‌సింగ్, శేఖర్, వసంత్, బక్కన్న, దేవన్న తదితరులున్నారు.

హిందువుల ఐక్యతకు ఆర్‌ఎస్‌ఎస్ కృషి



మల్లాపూర్‌లో మాట్లాడుతున్న వాసుదేవా రెడ్డి



ఖానాపూర్: పాతతర్లపాడ్‌లో..

లక్ష్మణచాంద: హిందువుల ఐక్యతకు పంచ పరివర్తన్ ద్వారా ఆర్‌ఎస్‌ఎస్ కృషి చేస్తుందని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా క్రీడా అధ్యక్షుడు అన్నం వాసుదేవారెడ్డి పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని మల్లాపూర్ ఆర్‌ఎస్‌ఎస్‌శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాఠశాలలో శనివారం విజయదశమి వేడుక నిర్వహించారు. వాసుదేవారెడ్డి ప్రధాన వక్తగా పాల్గొని మాట్లాడారు. 1925లో ప్రారంభమైన ఆర్‌ఎస్‌ఎస్ దేశభక్తి, హిందుత్వ ఆధార సంస్థలతో పని చేస్తుందన్నారు. దేశ అభివృద్ధికి హిందువులు పంచ పరివర్తన కోసం పాటుపడాలని సూచించారు. సామాజిక సామరస్యత, జీవన విలువలు, స్వఆధారిత జీవనం, పర్యావరణ పరిరక్షణ, పౌరవిధులు ప్రతి కుటుంబంలో పాటించాలన్నారు. రాబోయే రోజుల్లో ఇంటింటికీ జన జాగరణ చేపడుతామని అన్నారు. పెద్దమల చరణ్ కుమార్, ఖండ శారీరక్ ప్రముఖ్ ముఖేష్, స్వయంసేవకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధికి పాటుపడాలి..

ఖానాపూర్: దేశ అభివృద్ధి కోసం హిందువులు పంచ పరివర్తన ద్వారా పాటు పడాలని ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సహ శారీరక్ ప్రముఖ్ మోతె మహేందర్ పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్ల ఉత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని పాతతర్లపాడ్ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన వక్తగా హాజరై మాట్లాడారు. హిందుత్వ జీవన విధానం, విశ్వశాంతికి ఆధారమన్నారు. అన్ని మతాలను సమన్వయం చేసే సనాతన జీవన విలువలు హిందుత్వంలో ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రితీశ్ రాథోడ్

దస్తురాబాద్: స్థానికసంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రితీశ్ రాథోడ్ పేర్కొన్నారు. శనివారం దస్తురాబాద్‌లోని రామాలయంలో బీజేపీ మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపునకు కార్యకర్తలు, నాయకులు సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.